నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
III | హైదరాబాద్, గురువారం 24 ఏప్రిల్ 2025 | HYDERABAD

కొవ్వొత్తుల నివాళి | కశ్మీర్ ఉగ్రదాడిలో చనిపోయిన వారికి బేగంపేటలోని పర్యాటక భవన్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్, వివిధ రాష్ట్రాలకు చెందిన టూరిస్ట్ ఆపరేటర్లు - అమీర్‌పేట



బుధవారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న ఐపీఎల్ ముంబై టీమ్ యజమానురాలు నీతా అంబానీ కుటుంబసభ్యులు

ఆక్రమణలతో పాటు
అక్రమాలు బయటకు..
- ఎమ్మెల్యే కాలనీలో ఖాళీ స్థలాల్లో కబ్జా VI లో
- నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరణ

20 రోజులుగా.. మంచినీళ్లు లేక.. మంచినీళ్ల కోసం లాల్‌గడి మాలక్‌పేట మాలబస్తీ వాసులు రోడెక్కారు. బుధవారం ఖాళీ బిందెలతో ధర్నాకు దిగారు. 20 రోజులగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, వంటావార్పు చేయలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. -శామీర్‌పేట

దీపాలు వెలగట్లే.. చెత్త తొలగట్లే

బల్దియాలో గాడి తప్పుతున్న పాలన ● ప్రజల కనీస వసతులపై దృష్టి సారించని వైనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ప్రజల కనీస వసతులపై జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వహిస్తున్నది. రోజురోజుకు జనాలకు కష్టాల్లోకి నెడుతోంది. ఇప్పటికే సీఆర్ఎంపీ (సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం) నిర్వహణ గాలికి వదిలేసింది. ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలను పక్కన పెట్టి రహదారులన్నీ గుంతలమయం చేశారు. మరో వైపు పారిశుధ్యం అధ్వానంగా మారింది. జీవీపీ (తరచూ చెత్త వేసే ప్రాంతాలు) ఎత్తివేతలో విఫలమైంది. వీటన్నింటికీ తోడుగా వీధి లైట్ల సమస్య ప్రజలను మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు ఏర్పడ్డాయి. వాస్తవంగా వీధి లైట్లు చాలా చోట్ల వెలగడం లేదని, నిర్వహణ బాగులేదని సదరు ఈఈఎస్ఎల్ ఏజెన్సీపై మేయర్ నుంచి కమిషనర్, పాలకమండలి సభ్యులు సైతం ముక్తకంఠంతో వ్యతిరేకించారు. కానీ నిర్వహణలో మాత్రం అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడింది. సదరు ఏజెన్సీని గాడిలోకి తెచ్చుకోకపోగా...నూతన విధానాన్ని అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. ఈ క్రమంలోనే సదరు ఏజెన్సీ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తున్నది. వీధి లైట్ల నిర్వహణలో సదరు ఏజెన్సీ పనితీరు బాగులేదని ఏడాది కాలంగా

ఫిర్యాదులు వస్తున్నప్పుడు అధికారులు ఏం చేయాలి? సదరు ఏజెన్సీతో పనిచేపిస్తూనే కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలి. అనుభవాలు పునరావృతం కాకుండా వీధి లైట్ల నిర్వహణను చేపట్టాలి. కానీ జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు.. సదరు ఏజెన్సీతోనే గడువు ముగిసే వరకు పనులు చేపడుతున్నారు. కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపే వరకు మరో రెండు నెలల పాటు అవకాశమివ్వాలని ప్రస్తుతం ఉన్న ఈఈఎస్ఎల్ ఏజెన్సీని అభ్యర్థిస్తున్న అధికారుల పనితీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. అసలు ఎలక్ట్రికల్ విభాగంలో అనేక లోపాలు ఉన్నాయి. మిగతా IV లో

గ్రేటర్‌లో స్ట్రీట్ లైట్ లెక్కలివి

ఈఈఎస్ఎల్ ఏర్పాటు చేసిన సీసీఎంఎస్ బాక్సులు	30,200
ఒక్కో బాక్సు పరిధిలో వీధి లైట్లు	1520
మొత్తం వీధి దీపాలు	5.48 లక్షలు
ఏటా చెల్లిస్తున్న చార్జీలు	రూ.140 కోట్లు
మరమ్మతుల వ్యయం	రూ. 17 కోట్లు

ముడుపుముట్టందే.. పని జరగదు

కిందిస్థాయి ఉద్యోగుల దందా..

ఎన్ని ఫిర్యాదులొచ్చినా పట్టించుకోని అధికారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): దుండిగల్ లో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన గదిలో 30కి పైగా విద్యుత్ మీటర్లు బయటపడ్డాయి. ద్యుత్ శాఖ విచారణలో కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ మీటర్ల జారీ వెనక క్షేత్రస్థాయిలో పనిచేసిన సిబ్బంది పదిలక్షలకు పైగా వసూలు చేస్తే ఆ సమయంలో ఇక్కడ ఉన్నతాధికారిగా పనిచేసిన వారికి అందులో పెద్దమొత్తంలోనే డబ్బులు ముట్టినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని లైన్‌మెన్లు, ఆర్టిజన్లు కలిపి చేశారని దానికి అప్పటి ఉన్నతాధికారి సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రేటర్ శివారు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి అధికారులు చేస్తున్న దందా అంతాఇంతా కాదు. జీడిమెట్ల, కీసర, కూకట్‌పల్లి, మేడ్చల్, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది ఎక్కువ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రతీపనిలో ముడుపులు ముట్టందే పనిచేయడం లేదన్న ఆరోపణలున్నాయి. వినియోగదారుల నుంచి డబ్బుల వసూలు చేయడం, తమ పర్సంటేజ్ తీసుకుని పై అధికారులకు పెద్ద మొత్తంలో ముట్టజెప్పడం లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఆర్టిజన్లకు నిత్యకృత్యమైంది. కొత్తలైన్లు, లైన్ షిఫ్టింగ్, మీటర్లు, ప్యానల్‌బోర్డులు ఇలా ప్రతీ పనికో రేటు చొప్పున ఫిక్స్ చేస్తున్నారు. చాలామంది క్షేత్రస్థాయి సిబ్బందిపై ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదు. సిబ్బందిపై అవినీతి ఫిర్యాదులొస్తున్నా ఉన్నతాధికారులు వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఎస్టిమేషన్లు లేకుండా ప్యానల్‌బోర్డులు, విద్యుత్ మీటర్లు ఇస్తామంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని దక్షిణ డిస్కం ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చిన ఫిర్యాదు నంబర్లకు మొదట్లో రోజుకు పది వరకు ఫిర్యాదులు రాగా, ఇప్పటివరకు దాదాపు 400కు పైగా ఫిర్యాదులొచ్చినట్లు సమాచారం. గతంలో వచ్చిన 30 ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నామని అధికారులు చెబుతున్నా..ఇదంతా సాగతీత ధోరణిలా ఉందంటూ వినియోగదారులు చెబుతున్నారు.

ముఖ్యమంత్రి కార్యాలయం
ముట్టడిస్తాం..
- చాదర్‌ఘాట్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఎదుట
- ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు, లేబర్ల ధర్నా VI లో
- సర్కార్ స్పందించాలని డిమాండ్

మా కశ్మీర్ పర్యటన
రద్దు చేయండి..!
- పహల్గాం ఉగ్రదాడి ఘటనతో ఉలిక్కిపడ్డ నగర టూరిస్టులు
- ట్రావెల్ ఏజెన్సీలకు పర్యాటకుల మొర

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : పహల్గాం ఉగ్రదాడి ఘటనతో హైదరాబాదీ టూరిస్టులు అప్రమత్తమయ్యారు. వేసవి సెలవుల నేపథ్యంలో పలు నగరవాసులు కశ్మీర్ సందర్శనకు ప్రణాళికలు చేశారు. అందులో భాగంగా ట్రావెల్స్‌ను ఆశ్రయించి వివిధ ప్యాకేజీల కింద టూర్స్ బుక్ చేసుకున్నారు. కానీ మంగళవారం జరిగిన ఉగ్రదాడిలో పలువురు టూరిస్టులు చంపబడటంతో కశ్మీర్ ప్రయాణాన్ని నగర టూరిస్టులు రద్దు చేసుకున్నారు. అందులో భాగంగా నగరానికి చెందిన ఆరు గురు కుటుంబ సభ్యులు కశ్మీర్‌కు వెళ్లాల్సి ఉండగా, ఉగ్రదాడితో వారి ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారని 68 ఎం హాలిడేస్ ఎండీ సయ్యద్ ముర్తజా తెలిపారు. సాధారణంగా హైదరాబాద్ నుంచి కశ్మీర్ టూర్ వెళ్లడానికి నలుగురు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల వరకు ట్రావెల్స్ చార్జీ చేస్తాయి. చాలా మంది నగరవాసులు వేసవి సెలవులకు కశ్మీర్‌నే ఎంచుకుంటారు. అది మాకు చాలా ముఖ్య డెస్టినేషన్. జమ్ము, కశ్మీర్‌కు సుమారు 800– 900 వరకు బుకింగ్స్ అవుతున్నాయని ముర్తజా చెప్పారు. క్లౌడ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎండీ సయ్యద్ వాసీం మాట్లాడుతూ.. మూడేండ్ల నుంచి కశ్మీర్ డొమెస్టిక్ ట్రావెల్ లిస్టులో అత్యధిక ప్రాధాన్యత కలిగి ఉందని చెప్పారు. మే అండ్ జూన్ పర్యటన కోసం తాము 270 –360 ఫ్యామిలీలకు బుకింగ్స్ చేశామని వివరించారు. కానీ ఈ ఉగ్ర దాడి టూరిస్టుల ఆనంద భరిత జీవితాన్ని చెదరగొట్టిందన్నారు. మేలో ఉన్న టూర్ ప్యాకేజీలను సైతం తక్షణమే రద్దు చేయాలని కోరినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి శ్రీనగర్‌కు ప్రతీ రోజు రెండు ఫ్లైట్‌లను నడుపుతున్న ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలకు తమ టికెట్లు రద్దు చేయాలని ప్రయాణికులు, ట్రావెల్ ఏజెన్సీలు పెద్ద ఎత్తున కాల్స్ చేసి కోరుతున్నట్టు సంస్థలు తెలిపాయి.

ఈనెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులంతా దండై కదలి రావాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట గాంధీ బొమ్మ చౌరస్తా , కర్మన్ ఘాట్, బైరమల్‌గూడలో బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జెండాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై జెండాలను ఆవిష్కరించారు. – చంపాపేట, ఏప్రిల్ 23

వరంగల్‌కు దండై కదలాలి

వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఏఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డలో స్థానిక కార్పొరేటర్ సింగర్ రెడ్డి శిరిష సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – కాప్రా,ఏప్రిల్ 23

బాక్స్‌లో డబ్బులు పెట్టి.. ఫ్రిడ్జిలో ఉంచి

రెట్టింపు చేస్తానని.. మ్యాజిక్ మనీ పేరిట టోకరా.. బాధితుల ఫిర్యాదు

ఎల్బీనగర్: మ్యాజిక్ మనీ పేరుతో నగదును రెట్టింపు చేస్తానని నమ్మించి నగదుతో ఉడాయించిన ఉదంతం చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. సాయి కల్యాణ్, ఆనంద్ స్నేహితులు. ఆనంద్ స్నేహితుడైన శ్రీనివాస్‌ను సాయి కల్యాణ్‌తో పరిచయం చేశాడు. మ్యాజిక్ మనీ ద్వారా డబ్బులను రెట్టింపు చేయడం శ్రీనివాస్‌కు వచ్చునని చెప్పాడు. శ్రీనివాస్ రవి అనే వ్యక్తిని ఫోన్ చేసి పిలిపించాడు. తనకు ఎంత డబ్బు ఇస్తే మ్యాజిక్ ద్వారా అంత రెట్టింపు డబ్బులను ఇస్తామని రవి నమ్మబలికాడు. నమ్మిన సాయి కల్యాణ్ స్నేహితులైన ఆనంద్, శ్రీనివాస్‌లతో కలిసి రూ. 1.75 లక్షల నగదును రవికి అందజేశారు. ఈ డబ్బులను రూ. 5 లక్షలు చేసి ఇస్తానని రవి నమ్మించాడు. నగదును ఓ బ్రౌన్ రంగు బాక్స్‌లో పెట్టినట్లు మభ్యపెట్టి.. బాక్స్ పైన ఆకుపచ్చ రంగు టేప్‌తో చుట్టి దానికి పింక్ రంగు ఇంజక్షన్ ఇచ్చి..దానిని శ్రీనివాస్ నివాసంలోని ఫ్రిడ్జ్‌లో పెట్టాడు. తర్వాత రవి పత్తాలేకుండా పోయాడు. ఫ్రిడ్జిలో పెట్టిన బాక్స్‌ను తెరిచి చూడగా, అందులో తెల్లకాగితాలు కనిపించాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బట్టతలపై జుట్టు మొలిపిస్తామంటూ..

సిటీబ్యూరో/ఉప్పల్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): బట్టతలపై జుట్టు మొలిపిస్తామంటూ.. ఒక్కొక్కరి నుంచి రూ. 1000 వసూలు చేస్తూ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. ఢిల్లీకి చెందిన సల్మాన్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో వేగంగా బట్టతలపై వెంట్రుకలు మొలిపిస్తానంటూ..ప్రకటన చేశాడు. సూర్యపేట జిల్లా రాజునాయక్ తండాకు చెందిన హరీశ్ తాను ప్రాంఛైస్ తీసుకోవాలని భావించాడు. సల్మాన్‌తో మాట్లాడాడు. ఢిల్లీకి శిక్షణ కోసం తన అనుచరుడైన నాగోల్‌కు చెందిన రాజశేఖర్‌ను పంపించాడు. ఈ నేపథ్యంలోనే హరీశ్ తాను బట్ట తల ఉన్న వాళ్లకు మూడు నెలల్లో వెంట్రులకు మొలిపిస్తానంటూ మరోసారి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఉప్పల్ భాగాయత్ లోని శిల్పారామం వద్ద ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో వందలామంది బుధవారం అక్కడకు చేరుకున్నాడు. వారి వద్ద డబ్బులు తీసుకొని.. గుండు గీసీ.. షాంపు రద్ది పంపించారు. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. శిబిరం హరీశ్, రాజశేఖర్ నిర్వహిస్తున్నారని తెలుసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో మోసపూరితమైన ప్రకటన ఇచ్చి అందరిని ఆకర్షించినట్లు గుర్తించి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తమ డబ్బులు తమకు వాపస్ ఇప్పించాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. పోలీసులు మాత్రం ఇదంతా చట్ట విరుద్ధంగా నడుస్తుండడంతో తాము కేసు నమోదు చేశామని చెబుతున్నారు.

తంత్ర పూజలంటూ.. నమ్మబలికి
లక్షలు వసూలు చేసి

యూపీలో అఘోరి అరెస్టు..

నాగోల్ ఏసీపీ కార్యాలయంలో విచారణ

ఎట్టకేలకు చంచల్ గూడ జైలుకు తరలింపు

లింగ నిర్ధారణ పరీక్షలో ట్రాన్స్‌జెండర్‌గా..

చేవెళ్ల రూరల్ : శ్రీనివాస్ అఘోరి రిమాండ్ కథ ఎట్టకేలకు సుఖాంతమైంది. అఘోరి అవతారమెత్తిన శ్రీనివాస్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మోకిలా సీఐ వీరాబాబు తెలిపిన కథనం ప్రకారం.. శ్రీనివాస్ అలియాస్ అఘోరి మాత (28) గతంలో చెన్నై, ఇండోర్‌లలో లింగ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్నాడు. ఆధ్యాత్మిక దేవిగా ప్రచారం చేసుకొని.. పూజలు, మంత్రాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాడు. ప్రొద్దుటూరులో ఓ మహిళకు దుష్ట శక్తుల నుంచి రక్షించేందుకు తంత్ర పూజలు చేయాల్సిన అవసరం ఉందని నమ్మబలికి లక్షలు వసూలు చేశాడు. తాంత్రిక శక్తులతో ఆమెను చంపేస్తానని హెచ్చరించాడు. భయపడిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు శ్రీనివాస్ అఘోరిని యూపీలో అరెస్టు చేసి..నార్సింగి ఏసీపీ కార్యాలయంలో విచారించారు. చేవెళ్ల ప్రభుత్వ దవాఖానలో వైద్యపరీక్షలు చేయించి.. చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు శ్రీనివాస్ అఘోరిని కంది జైలుకు తరలించారు. పోలీసులు శ్రీనివాస్ అఘోరిని తీసుకుని కంది జైలు నుంచి మళ్లీ చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చి, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. నిందితుడు ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారణ కావడంతో మెడికల్ రిపోర్ట్ తీసుకుని పోలీసులు మళ్లీ కోర్టుకు వెళ్లారు. వైద్యుల నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి శ్రీనివాస్ అఘోరిని ట్రాన్స్‌జండర్లకు ప్రత్యేక బ్యారక్‌లు ఉన్న చంచల్ గూడ జైలుకు తరలించాలని ఆదేశించారు. దీంతో పోలీసులు శ్రీనివాస్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. చేవెళ్ల కోర్టు ముందు మీడియాతో మాట్లాడిన అఘోరి తాను పోలీసులకు, కోర్టుకు సహకరిస్తున్నానని చెప్పారు. చట్టం తనపని తాను చేసుకుపోతోందని స్పష్టం చేశారు.

బంగ్లాదేశ్ యువకుడికి బర్త్ సర్టిఫికెట్

నార్సింగిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం

రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్.. ఇద్దరు అదుపులోకి..

మణికొండ, ఏప్రిల్ 23 : బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన ఓ యువకుడికి నార్సింగి మున్సిపాలిటీ నుంచి బర్త్ సర్టిఫికెట్ జారీ అయిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం రంగంలోకి దిగారు. నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో సుధీర్ అనే వ్యక్తి ఆరేళ్లుగా ఔట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. అధికారులు ఇతడికి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే బాధ్యతలను అప్పగించారు. దీనిని అనుకూలంగా మార్చుకున్న సుధీర్.. బంగ్లాదేశీయుడికి నార్సింగిలో జన్మించిన వ్యక్తిగా జనన ధ్రువీకరణ పత్రం జారీ చేశాడు. సుమారు రెండేళ్ల కిందట ఈ పత్రం తీసుకున్న బంగ్లాదేశ్ యువకుడు.. ఇటీవల పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో జరిగిన పోలీసు వెరిఫికేషన్‌లో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు సుధీర్ తో పాటు సదరు బంగ్లాదేశ్ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. సుధీర్ రెండేండ్ల కిందట ఒకరికి అప్పటి కమిషనర్ సత్యబాబు డిజిటల్ సంతకంతో జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్టు తెలిసింది. అది నకిలీదని, దానిపై విచారణ చేస్తున్నామని, అతన్ని అదుపులోకి తీసుకుంటున్నామని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. , విచారణకు పూర్తి స్థాయిలో సహకరించాలని మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డిని కోరారు.

రూ.10 లక్షలకు ఒప్పందం ?

నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల నుంచి కొంతమంది యువకులు అక్రమ దారిలో వచ్చి ఇక్కడే స్థిరపడినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిసింది. అయితే బంగ్లాదేశ్ నుంచి వచ్చిన యువకుడికి అక్రమ దారిలో మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సుధీర్ అప్పటి కమిషనర్ సత్యబాబుతో కలిసి రూ. 10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని ఈ సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలిసింది. ఇతడితో పాటు మరికొంతమంది విదేశీయులకు సర్టిఫికెట్లు, డూప్లికేట్ పత్రాలను కూడా ఈ ముఠా కొంతమంది స్థానిక వ్యక్తుల సహాయంతో చేసినట్లు తెలిసింది. ఒక నార్సింగ్ మున్సిపాలిటీలోని దాదాపు 20 మంది ఇతర దేశాల(బంగ్లాదేశ్, పాకిస్తాన్) నుంచి వచ్చి తప్పుడు పత్రాలతో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నట్లు తెలిసింది. వీరిపైనా టాస్క్ ఫోర్స్ పోలీసులు లోతైన విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

గ్రేటర్ @ 39.2డిగ్రీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండలు మండిపోతున్నాయి. నగర వ్యాప్తంగా సరాసరి పగటి ఉష్ణోగ్రతలు 40కి దగ్గరగా నమోదవడంతో జనం పగలు సమయంలో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడం, పొడి వాతావరణం ఏర్పడడంతో వడగాలులు వీస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 27.2డిగ్రీలు, గాలిలో తేమ 29 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా రాగల మరో రెండు మూడు రోజులు నగరంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉండడంతో గ్రేటర్‌కు వాతావరణ కేంద్రం అధికారులు ఎల్లో హెచ్చరికలు జారీచేశారు. వడగాల్పులు వీచే అవకాశాలుండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

హెచ్‌సిటీపై
నీలినీడలు
- భూసేకరణకు వెళ్లిన అధికారులకు చుక్కెదురు
- కేబీఆర్ పార్కు వద్ద న్యాయపరమైన చిక్కులు VI లో